ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
5 సోమవారం 13 మే 2024


ఈవీఎంలు తీసుకువెళుతున్న పోలింగ్ సిబ్బంది



ఓటేద్దాం..

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ప్రశాంత ఓటింగ్‌కు పటిష్ఠమైన ఏర్పాట్లు
- సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్.. సీసీ కెమెరాలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- సెక్టార్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో తరలిన సిబ్బంది



సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ సోమవారం జరగనుంది. వివిధ ప్రాంతాల నుంచి ఓటర్లు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఓటేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ల ద్వారా, 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్‌లో ఓటేశారు. మిగిలిన సాధారణ ఓటర్లు సోమవారం ఈవీఎం యంత్రాలలో మీట నొక్కి వారి తీర్పుని ఇవ్వనున్నారు. షెడ్యూల్, నోటిఫికేషన్, నామినేషన్లు, ప్రచారం ఇలా ఒక్కో అంకం దాటుకుంటూ వచ్చిన ఎన్నికల సమరం తుది ఘట్టమైన సోమవారం పోలింగ్ డేకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.


రేపల్లె: అయోవా బాలికోన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు


రేపల్లె : ఈవీఎంలను తీసుకుని వెళుతున్న ఎన్నికల సిబ్బంది


బాపట్ల : ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ల వద్ద పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది.


నరసరావుపేటలో కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ విధులకు కేటాయిం చిన సిబ్బంది అంతా పంపిణీ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకుని ఆదివారం మధ్యాహ్నం నుంచి తమతమ పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ప్రతి కేంద్రంలో 120 శాతం సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎక్కడ ఎటువంటి అవసరం వచ్చిన అందుబాటులో ఉండేలా రిజర్వ్ సిబ్బందిని కూడా నియమించారు. ఎక్కడైనా ఈవీఎంలు పనిచేయకపోతే వాటి స్థానంలో ఏర్పాటు కు 20 శాతం అదనంగా సిద్ధం చేశారు. ఓటింగ్ ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పూర్తి పారదర్శకంగా జరగాలని ఎన్నికల అధికారులు ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల వెలుపల జనం గూమికూడకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్‌ని అమలు చేయనున్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల వెలుపలే ఉండి పరిశీలించుకోవాలి. పోలింగ్ కేంద్రాలను పరిశీలించడానికి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంది. అభ్యర్థులు తిరగడానికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చా రు. ఒక వాహనంలో డ్రైవర్‌తో కలిపి ఐదుగురికి మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతి చ్చింది. జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏదైనా సంఘటన జరిగితే దగ్గరలో ఉన్న అధికారులకు తెలిపి వెంటనే తగు చర్యలు తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితులను చక్కబరచడానికి క్విక్ రెస్పాన్స్ టీం, రాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశారు.

స్లిప్పులు లేకపోయినా ఓటు..

ఓటరు తన పోలింగ్ బూత్, సీరియల్ నెంబరు తెలుసుకుని ఏదైనా గుర్తింపు కార్డుతో కేంద్రానికి వెళితే ఓటు వేయడానికి అనుమతిస్తారు. స్లిప్పులు పొందలేకపోయిన వారు ఓటరు ఐడీ కార్డు తీసుకుని బూత్ వద్దకు వెళితే అక్కడి సిబ్బంది చూసి ఓటర్ స్లిప్పుని అప్పటికప్పుడు ప్రింట్ తీసి ఇస్తారు. ఓటరు కార్డుకు ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపుకార్డులు తీసుకువెళ్లడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. వీటిలో ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, పాస్‌బుక్, ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్ తదితర కార్డులను ఓటు హక్కు వినియోగం కోసం గుర్తింపు కార్డుగా అనుమతిస్తామన్నారు సాయంత్రం ఆరు గంటల లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలోకి ఎవరైతే ప్రవేశిస్తారో వారికి మాత్రమే టోకెన్ నెంబర్లు ఇచ్చి ఎంత సమయమైనా ఓటు వే య ండా ని కి అవకాశం కల్పిస్తారు. సెల్ ఫోన్లను పోలింగ్ కేంద్రాల ఆవరణలో నిషేధించారు. పోలింగ్ బూత్‌లు లోకేషన్‌కు ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో తాగు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, బారికేడింగ్, క్యూలైన్‌లు, వీటిపై షామియానాలను ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం వీల్‌చైర్లను పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేశారు.


ఈవీయంలను సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది


ఎన్నికల విధులు రద్దు చేయడంతో వెనుదిరిగిన దివ్యాంగ ఉపాధ్యాయురాలు

పటిష్ఠ నిఘా.. పలువురు బైండోవర్

మున్సిపాల్టీలు, గ్రామాల్లో ప్రశాంత ఎన్నికలకు ముందస్తు చర్యల్లో భాగంగా వేలాది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో బందోబస్తుకు నియమించారు. శాంతియుత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియ సాగడానికి పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మొహరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు ప్రతి చోట పటిష్ఠ నిఘా పెట్టి పోలింగ్ ప్రక్రియను పోలీసులు పర్యవేక్షించనున్నారు. లోపల వెబ్‌కాస్టింగ్ ఉంటే బయట సీసీ కెమెరాలతో కదలికలను పోలీసులు గమనించ నున్నారు. నేరచరిత్ర ఉన్నవారిని ఇప్పటికే బైండోవర్ చేసిన పోలీసు శాఖ హద్దుదాటితే కఠిన చర్యలు తప్పవనే హెచ్చరి కలు జారీ చేసింది. రాజకీయ పార్టీల అనుచరులు సైతం రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, ప్రజలంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగిం చుకునేలా చూడడమే తమ ధ్యేయమని పోలీసు శాఖ చెబుతోంది.

మొత్తం ఓటర్లు 12,91,716

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓటర్ల సంఖ్య 12,91,716 మంది. వీరిలో పురుషులు 6,29,794 మంది ఉండగా, ఇత రులు 81, మహిళలు 6,61,841 మంది ఉన్నారు. ఓటర్లలో అత్యధికంగా అద్దంకిలో 2,44,057 మంది ఉండగా, అత్యల్పంగా బాపట్లలో 1,90,925 మంది ఉన్నారు. గత ఎన్నికల్లో జిల్లాలో 86 శాతం ఓటింగ్ జరగ్గా ఈ సారి ఆ శాతం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల జరిగిన పోస్టల్‌బ్యాలెట్ ఓటు శాతం కూడా దాదాపు 85 శాతం ఉండడంతో సోమవారం జరిగే ఓటింగ్ శాతం ఎక్కువగానే ఉండొచ్చనేది పలువురి అభిప్రాయం.

జిల్లా వ్యాప్తంగా 1510 పోలింగ్ కేంద్రాలు

బాపట్ల జిల్లా వ్యాప్తంగా 1510 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో 1030 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అద్దంకిలో అత్య ధికంగా 69 ఉండగా, తర్వాత స్థానాల్లో బాపట్ల 68, పర్చూరు 62, రేపల్లె 51, వేమూరు 47, చీరాలలో 60 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,219 మంది సిబ్బంది ఎన్నికల ప్రక్రియ విధుల్లో భాగస్వాములు కానున్నారు. వీరిలో పీవోలు 1811 మంది ఉండగా, ఏపీవోలు 1808 మంది ఉన్నారు. ఓపీవోలు 7,252 మంది కాగా మైక్రో అబ్జర్వర్లుగా 348 మంది విధుల్లో ఉండనున్నారు. పోలింగ్ ప్రక్రియ కోసం జిల్లా పోలీస్ శాఖ నుంచి 1500 మంది విధుల్లో ఉండనుండగా, బీఎస్ఎఫ్, టీఎస్ఎస్‌పీ, ఐటీబీపీ కంపెనీల నుంచి 700 మంది వరకు బందోబస్తు విధుల్లో ఉండనున్నారు. తమిళనాడు నుంచి 250 మంది రాగా, ఎక్స్ ఆర్మీతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలను కూడా వినియోగించుకోనున్నారు.

పోలింగ్‌కు నాలుగంచెల భద్రత

పల్నాడు జిల్లాలో ప్రశాంత పోలింగ్‌కు పోలీసు శాఖ నాలుగంచెల భద్రత ను ఏర్పాటు చేసింది. సుమా రు 6,000 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 20 కంపెనీల కేంద్ర భద్రతా బలగాలను రప్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద స్టాటిక్ ఫోర్స్ ఎస్ఐ స్థాయి అధికారితో రూట్ మొబైల్ పార్టీ, సీఐ స్థాయి అధికారితో మండల పరిధిలో స్ట్రైకింగ్ ఫోర్స్, డీఎస్పీ స్థాయి అధికారితో నియోజకవర్గ స్థాయిలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌గా నాలుగంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీరి పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి అదనపు ఎస్పీ స్థాయి అధికారి అదనపు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌తో సిద్ధంగా ఉంచారు. 558 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించి ఆయా కేంద్రా లకు ప్రత్యేకంగా కేంద్ర పారా మిలిటరీ బలగాలను బందోబస్తుకు నియమించారు.

బాపట్ల కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం..

ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఓటింగ్ విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా టోల్ ఫ్రీ నంబరు 1950 తోపాటు 08643-297802 నంబరుకు ఫోన్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా తెలిపారు. ఫిర్యాదు వచ్చిన నిమిషాల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించేలా చూస్తామన్నారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపిచ్చారు.


వినుకొండ: పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద కుప్పకూలిన బండి నిర్మల


బాపట : కర్లపాలెం పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన భారీకేడ్‌లు

టెన్షన్ టెన్షన్



- ఓటరు నాడిపై అభ్యర్థుల్లో ఆందోళన
- చివరి ప్రయత్నంగా బుజ్జగింపులు, ప్రలోభాలు
- పోలింగ్ ముందు రోజూ విచ్చలవిడిగా వైసీపీ నగదు పంపిణీ
- డబ్బులు అందలేదని పార్టీ కార్యాలయాల వద్ద ఓటర్ల పడిగాపులు

బాపట్ల, గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రచారం ముగిసింది.. ఓటనే ఆయుధంతో ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఈవీఎంలలో ఏ గుర్తుపై ఓటర్లు బటన్ నొక్కుతారనే టెన్షన్‌లో అభ్యర్థులు ఉన్నారు. ఇక పెద్దఎత్తున నగదు పంపిణీపై ప్రచారాల నేపథ్యంలో తమకు ఆ మొత్తాలు అందలేదనే ఆందోళనలో ఓటర్లు ఉన్నారు. సుమారు రెండు నెలల నుంచి విస్తృతంగా ఏర్పాట్లు చేసిన అధికారులు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతం నిర్వహించాలనే టెన్షన్‌లో అధికారులు ఉన్నారు. మొత్తం మీద అటు అభ్యర్థులు ఇటు అధికారులు మధ్యలో ఓటర్లు అందరూ కూడా వారివారి రీతుల్లో టెన్షన్‌లో ఉన్నారు. మరికొద్ది గంటల్లో పోలింగ్ బూత్‌లు తెరుచుకోనుండగా ఓటర్లు ఈవీఎంలలో మీట నొక్కేందుకు సిద్ధమయ్యారు. ప్రచారం గట్టిగానే చేశాం.. ప్రత్యర్థి పార్టీలోని అసమ్మతి నాయకులను గుర్తించి మద్దతు పొందగలిగాం.. ప్రజల్లో ఆదరణ బాగానే ఉంది.. తెరవెనక పంపకాలను బాగానే చేశాం.. ఓటరు నాడీ ఏ తీరున ఉందోననే సందేహంతో అభ్యర్థుల్లో ఆందోళన. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తమను ఎన్నికల గండం గట్టెక్కిస్తాయన్న భరోసా పాలకపార్టీ నేతలది. వీటి నేపథ్యంలో సోమవారం పోలింగ్ జరగనుండడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో ఓటర్ల నాడిపై విస్తృతంగా చర్చ నడిచింది. ప్రచారానికి శనివారం సాయంత్రమే తెరపడడంతో ఆదివారం మొత్తం కీలక నేతలతో మంతనాలు, పోలింగ్ బూత్‌లకు తమ ఓటర్లను తరలించడానికి చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై కసరత్తు చేశారు. కొన్ని దగ్గర్ల ప్రలోభాల పర్వాలు కూడా కొనసాగాయి. ద్వితీయశ్రేణి నేతల్లో ముఖ్యమైన వారితో అంతర్గత సమావేశాలను ఆదివారం అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్నారు. పంపకాల పర్వం అంతా సజావుగా జరిగిందా లేదా అని ఆరా తీయడంతో పాటు పోలింగ్ రోజు ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడలు ఎలా ఉండనున్నాయి అనే కోణం లో కూడా నేతలతో సమీక్ష జరిపి తాము అనుసరించాల్సిన వ్యూహాలను కూడా వారికి చెప్పారు. సోమవారం పోలింగ్ డే కావడంతో అభ్యర్థులంతా ఓటింగ్ సరళిపైనే దృష్టి పెట్టను న్నారు. ప్రత్యర్థిపార్టీలకు పట్టు ఉన్న బూత్‌లపై ఇరుపార్టీలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

కొనసాగిన పంపకాలు

ఓటర్లకు ప్రలోభాలు ఆదివారం కూడా కొనసాగాయి. నగదుతో ఎలాగైనా ఓటుని కొనుగోలు చేసేందుకు అధికార వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. ఇంకా ఎవరికైనా నగదు ఇవ్వకపోయి ఉంటే వారికి సోమవారం అయినా ఇస్తామని చెబుతూ ప్రలోభ పెడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి మఫ్టీ పోలీసులు తిరిగారు తప్ప పెద్దగా డబ్బు, మద్యం పంపిణీని అరికట్టలేకపోయారు. కొందరైతే చూసీచూడనట్లుగా వదిలేశారు. దీంతో వైసీపీ కార్యకర్తలు యథేచ్ఛగా డబ్బు పంపిణీ చేసి ఓటర్లను ప్రలో భాలకు గురిచేసేందుకు ప్రయత్నించారు. వైసీపీ ఈ దఫా పూర్తిగా ఓటర్లకు డబ్బు పంపిణీ పైనే ఎన్నికల్లో ఆధార పడింది. ఇందుకు కారణం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో ముందు ఆ పార్టీ హామీలు తేలిపోయాయి. కాగా వైసీపీ ఇచ్చిన మేనిఫెస్టో గురంచి ఎక్కడా చర్చ కూడా జరగలేదు. దీంతో ఆ పార్టీ అభ్యర్థులంతా ఓటర్లకు నగదు పంపిణీ చేసి ఎలాగైనా గెలువాలని కుతంత్రాలు చేస్తూనే ఉన్నారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి గరిష్ఠంగా రూ.3,500 వరకు నియోజక వర్గాన్ని బట్టి పంపిణీ చేశారు. కొన్ని చోట్ల తమకే ఓటు వేయాలని ప్రమాణం చేయించుకున్నారు. కాగా కొంతమంది అభ్యర్థుల అనుచరులు ఓటర్లకు డబ్బు పంచుతామని నేతల వద్ద తీసుకుని వాటిని నొక్కేశారు. దాంతో ఆదివారం పలువురు అభ్యర్థుల ఆఫీసుల, వార్డుల్లోని పార్టీ కార్యాలయాల ఎదుట ఓటర్లు పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు వేచి చూసి ఓపిక నశించి శాపనార్థాలు పెట్టుకుంటూ వెనుదిరిగారు.

ఓటు వేసిన వెంటనే వెళ్లేందుకు ప్రణాళిక

ఇతర ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు జిల్లాకు వచ్చిన వారు ఓటు వేసిన వెంటనే వెళ్లిపోయేం దుకు సిద్ధమయ్యారు. సోమవారం సాయంత్రం వరకే సెలవు కారణంగా ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఓటు వేసి వెళ్లాలనే ఆలోచనలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు ఉన్నారు. ఆది వారం రైల్వే రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ల వద్ద తత్కాల్ సమయంలో విపరీతమైన డిమాండ్ తలెత్తింది. వేజండ్ల లాంటి చిన్న రైల్వేస్టేషన్‌లోనే 40 వరకు తత్కాల్ ఫారంలను ప్రయాణికులు పెట్టారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయితే వారిలో కేవలం 10 మందికి మాత్రమే బుకింగ్ అయ్యాయి. సోమవారం మధ్యా హ్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నుంచే తిరుగు ప్రయాణాలు ప్రారంభం కానున్నాయి. రైల్వే శాఖ రెగ్యులర్ రైళ్లతో పాటు గుంటూరు మీదగా సికింద్రాబాద్‌కు సోమవారం ఏడు ప్రత్యేక రైళ్లను నడపబోతోన్నది. అలానే ఏపీఎస్‌ఆర్‌టీసీ, టీఎస్‌ఆర్‌టీసీ కూడా వందల సంఖ్యలో స్పెషల్స్‌ని ఏర్పాటు చేశాయి.

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా అపహరణ

కారంపూడి: మండలంలోని పేటసన్నిగండ్ల శివారు సింగరుట్లతండాలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కేంద్రంలోని సీసీ కెమెరా, కేబుల్ వైరును అపహరించారు. అత్యంత సమస్యాత్మక నియోజకవర్గమైన మాచర్ల పరిధిలో 299 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసింది. ఆదివారం ఉదయం కేంద్రానికి వచ్చిన ఎన్నికల సిబ్బంది సీసీ కెమెరా, కేబుల్ వైరు అపహరణకు గురై ఉండటాన్ని గుర్తించి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామాంజినేయులు కేసు నమోదు చేశారు. పోలింగ్ కేంద్రంలో మరో సీసీ కెమెరా, కేబుల్ వైరు ఏర్పాటు చేశారు.

ఉద్యానానికి ఉరి



ఉద్యాన పంటలకు రాయితీలు, ప్రోత్సాహకాలతో 2014 నుంచి 2019 వరకు ఉద్యాన పంటల సాగు విషయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులకు స్వర్ణయుగం నడిచింది. క్రమం తప్పకుండా రాయితీలు అందించడంతో పాటు ఎక్కువమంది రైతులను ఉద్యాన పంటల సాగు వైపు మళ్లించడానికి అప్పటి ప్రభుత్వం పెద్ద యజ్ఞమే చేసింది. దాదాపు రూ.100 కోట్లపైనే అప్పటి ప్రభుత్వం ఒక్కో జిల్లాకు రాయితీల కోసం వెచ్చించింది. ఈ ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 80,000 హెక్టార్ల వరకు ఉద్యాన పంటల సాగు వెళ్లింది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అసలు ఉద్యాన పంటలు, సాగు గురించే ఆలోచించలేదు. దీంతో పాటు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినా వారికి ప్రోత్సాహం అందించలేదు. పైగా రాయితీలు ఇవ్వకుండా నానుస్తూ వచ్చింది. దీంతో ఈ ఐదేళ్లుగా ఉద్యాన పంటల సాగు అంతంతమాత్రంగానే ఉంది. అదే గత టీడీపీ ప్రభుత్వం లాగే ఈ ఐదేళ్లలోనూ అదే ఒరవడి కొనసాగి ఉంటే ఉద్యాన పంటల సాగు ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్ష హెక్టార్ల మార్కును తాకి ఉండేది. కానీ అలాంటిదేమి జరగకపోగా ఏటికేడు సాగులో తీసికట్టు నమోదవడం గమనార్హం.

- వైసీపీ పాలనలో తిరోగమనం
- ఐదేళ్లుగా పంటల రాయితీలకు మంగళం
- కేంద్రం నిధులను దారి మళ్లించిన రాష్ట్ర ప్రభుత్వం
- బాపట్ల జిల్లా రైతులకే రూ.200 కోట్లపైగా ఎగనామం
- ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రూ.500 కోట్లపైమాటే
- నాడు ప్రోత్సాహం.. నేడు తిరస్కారం

బాపట్ల, మే12 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటల సాగుతో రైతులు నష్టపోతున్నారు. నానాటికి ఆయా పంటల సాగు కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. లాభాలు అత్యధికంగా ఆర్జించే ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి పెడుతున్నారు. అయితే సంప్రదాయ పంటలసాగుతో పోలిస్తే ఉద్యాన పంటల సాగుకు పెట్టుబడి అధికం. దీంతో ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించి ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీలు, విత్తనాలు అందించాలని నిర్ణయించాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గత టీడీపీ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించింది. అయితే టీడీపీ పాలన పురోగమనానికి చిరునామాగా ఉంటే వైసీపీ ఐదేళ్లలో నామమాత్ర ఖర్చు కూడా ఉద్యాన పంటల సాగు ప్రోత్సాహకాల కోసం ఖర్చు పెట్టలేదు. పైగా బకాయిల చెల్లింపుల విషయంలో ఇప్పటికీ అతీగతి లేకుండా చేసింది. పైగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను సైతం దారి మళ్లించి ఉద్యాన రైతుల నోట్లో మట్టి కొట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది. మరోవైపు ఏడాదిన్నర క్రితం ఉద్యాన పంటల కోసం జిల్లాల వారీగా ప్రణాళికలు రచించామని, ఇక నిధుల కేటాయింపే తరువాయి అనే ఉపన్యాసాలు ఇచ్చి నిలువునా వంచించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో 70 వేల మందికి లబ్ధి..

ఉద్యాన పంటలసాగుకు మేలైన విత్తనాల కోసం షేడ్‌నెట్, పాలీహౌస్ వంటివాటితో పాటు మల్చింగ్ షీట్లు కూడా అవసరం అవుతాయి. టీడీపీ హయాంలో నిమ్మ, జామ, బొప్పాయి, మామిడి తోటల విస్తరణకు క్రమం తప్పకుండా రాయితీలను అందించింది. ఎకరాకు రూ.5,000 వరకు ఈ ప్రోత్సహకాన్ని అందించేవారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ఉండేది. ఇదేకాకుండా బిందు, తుంపర సేద్యం ప్రాజెక్టులను గ్రామాలను యూనిట్‌లుగా తీసుకుని అమలు చేసేది. ఏటా ఈ లక్ష్యాన్ని పెంచుకుంటూ దాదాపు 10,000 ఎకరాలను డ్రిప్ పరిధిలోకి తెచ్చింది. 4,000 ఎకరాల్లో మల్చింగ్ షీట్ రాయితీలను ఇచ్చింది. ఇవే కాకుండా ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీలు, రాయతీలపై ఏసీ వాహనాలు ఇలా ఉద్యాన రంగ పురోగమనానికి కృషి చేసింది. టీడీపీ ప్రభుత్వ ఐదేళ్లలో వివిధ పథకాల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 70,000 మంది రైతులకు లబ్ధి చేకూరింది

వైసీపీ పాలనలో తిరోగమనం..

వైసీపీహయాంలో ఉద్యానరైతులకు గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారు. రాయితీలను ఎత్తివేయడంతోపాటు బకాయిల విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఉద్యాన పంటల సాగును తిరోగమన బాట పట్టించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది. 2019 నాటికి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 80,000 హెక్టార్ల వరకు సాగు జరిగింది. బాపట్ల జిల్లాలో ఈ పంటల సాగు 37,000 హెక్టార్ల వరకు వెళ్లింది. 2020 నుంచి వరుసగా నాలుగేళ్ల తగ్గుముఖమే తప్ప వృద్ధి లేదు. ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటల సాగు సగటున 50,000 హెక్టార్లలోపుకే పరిమితమైనట్లు తెలుస్తోంది. రైతుల నష్టపోయిన రాయితీల మొత్తం విలువ గడచిన ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరుజిల్లా వ్యాప్తంగా రూ.500 కోట్లకు పైమాటేనని అంచనా.

బకాయిలకు లభించని మోక్షం

ఉద్యాన రైతులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో దాదాపు మూడున్నరేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతూ వస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే పెండింగ్ ఉన్న రాయితీ బకాయిలు రూ.50 కోట్లుకాగా, ఒక్క బాపట్ల జిల్లావరకు ఈ మొత్తం సుమారు రూ.20 కోట్లు వరకు ఉన్నట్లు సమాచారం. రాయితీలు అందించకపోగా బకాయిల విషయంలో ఏళ్ల తరబడి రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. వీటిలో 60 శాతం మేర గడచిన ఏడాది చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని బకాయిలను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్‌తో సరిపెట్టినట్లు తెలుస్తోంది. కేంద్రం ఇచ్చే రాయితీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయకుండా వేరే అవసరాలకు మళ్లించడంతో గడచిన ఏడాది కేంద్రం ప్రత్యేక ఖాతాలు తెరిపించి వాటిలో రాయితీ సొమ్ము జమ చేయడం వల్లే కొన్ని బకాయిలకైనా మోక్షం లభించిందనేది సమాచారం

రైతులను మోసం చేయడానికి మరో ఎత్తుగడ..

ఉద్యాన పంటల సాగును పట్టించుకోకుండా ఏళ్ల పాటు కుంభకర్ణ నిద్ర పోయిన వైసీపీ ఏడాదిన్నర క్రితం రాయితీ ప్రణాళికలంటూ సరికొత్త పల్లవిని ఎత్తుకుంది. ఇందులో భాగంగా ఒక్క బాపట్ల జిల్లాకే రూ.25కోట్లతో ఉద్యాన సాగు ప్రణాళికలంటూ ఊదరగొట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ ప్రణాళికల్లో కేటాయించిన వాటా రూ.60 కోట్లకు పైమాటే. ఇవి కూడా పేపర్లకే పరిమితమయ్యాయి తప్పితే ఒక్క రూపాయి నిధులు విదిల్చిన పాపాన పోలేదు.

వైసీపీ గూండాల అరాచకం

- టీడీపీ ఏజెంట్లుగా కూర్చుంటే చంపేస్తాం
- టీడీపీ నేతల గృహాలకు వెళ్లి వైసీపీ గూండాలు దాడి
- ట్రాక్టర్ ధ్వంసం



వైసీపీ గూండాల దాడిలో గాయపడిన టీడీపీ సానుభూతిపరులు

మాచర్లటౌన్, మే 12: వైసీపీ గూండాలు బరితెగించారు. ఎన్నికల రోజు ఏజెంట్‌గా కూర్చుంటే చంపేస్తాం నా.. అంటూ బెదిరింపులకు దిగారు. టీడీపీ నేతలు ఎదురు తిరగడంతో దాడికి పాల్పడ్డారు వైసీపీ గూండాలు. టీడీపీ సానుభూతిపరుల నివాసాలపై వైసీపీ నేతలు అత్యంత పాశవికంగా దాడి చేసిన ఘటన రెంటచింతలలో ఆదివారం జరిగింది. రెంటాలకు చెందిన మల్లయ్య, సిద్ధయ్యలు సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెంటాల పోలింగ్ బూత్‌ల్లో ఏజెంట్లుగా కూర్చున్నేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వైసీపీ నేతలు మోర్తాల ఉమామహేశ్వరరెడ్డితోపాటు మరో 30 మంది వైసీపీ గూండాలు రెంటచింతలలోని వైఆర్ఎస్ హైస్కూల్ సమీపంలో నివాసముంటున్న టీడీపీ నేతలు మల్లయ్య, సిద్ధయ్యల గృహాలకు వెళ్లారు. ఆ సమయంలో సిద్ధయ్య, మల్లయ్యలు భోజనం చేస్తుండగా కంచం లాగేసి ఛాతి భాగాన ఎగిరి తన్నారు. అంతటితో ఆగకుండా విచక్షణా రహితంగా రాడ్లు, కర్రలతో దాడి చేసి గాయపరిచారు. మహిళలపై దుర్భాషలాడారు. ట్రాక్టర్‌ను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో టీడీపీ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ సానుభూతిపరులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని వైసీపీ నేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కారంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి సకాలంలో అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పోలీసులు సకాలంలో రాకుంటే ప్రాణాలు పోయేవని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు వచ్చి వైసీపీ గూండాలు నుంచి కాపాడారన్నారు. జరిగిన దాడిపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైసీపీ దాడులకు బయపడేది లేదు ... బ్రహ్మారెడ్డి

వైసీపీ దాడులకు భయపడేది లేదని, తమ కార్యకర్తలను కాపాడుకుంటామని, వారికి అండగా ఉంటామని, ఎవరూ భయపడాల్సిన పనిలేదని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి బాధితులకు భరోసానిచ్చారు. ఆదివారం జరిగిన సంఘటనపై రెంటచింతల పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ నారాయణస్వామికి బ్రహ్మారెడ్డి వివరించారు. పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని, సమన్యాయం అందరికీ వర్తించేలా చూడాలని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతలపై దాడుల పరంపర కొనసాగుతోందని, దీనికి అంతం లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నేత సిద్ధయ్యపై వైసీపీ నేతలు దాడి చేసి ట్రాక్టర్‌ను ధ్వంసం చేయడం, అన్నం తింటుండగా కంచం లాగడం అరాచకమన్నారు. పోలింగ్ ముందు రోజు తమ పార్టీ ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేయడం, దాడులు చేయడం అనాగరిక చర్య అన్నారు. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే పోలింగ్ రోజున అధికారపార్టీ అరాచకాలను ఊహించడం కష్టంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా దౌర్జన్యాలు, హింస మార్గాలకు స్వస్తి పలికి ఎవరి ఓటు వారు వేసుకునేలా వ్యవహరించాలని, అందుకు పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బాధితులను పరామర్శించి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. టీడీపీ బడుగు, బలహీనుల పార్టీ అని అన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు చప్పారపు అబ్బిరెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, శౌరెడ్డి, కాయితి రవికృష్ణారెడ్డి, బాలయ్య, ఆదూరి శివ, ముని నాయక్ ఉన్నారు.



వైసీపీ నేతల దాడిలో ధ్వంసమైన ట్రాక్టర్

ఏజెంట్లుగా నిలబడతారా... అంతు చూస్తాం
- కాకిరాలలో వైసీపీ గూండాల వీరంగం

దుర్గి : ఏజెంట్లుగా నిలబడతారా.. మీ అంతు చూస్తాం అంటూ వైసీపీ గూండాలు వీరంగం సృష్టించి దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో ఇరువురు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. మండలంలోని కాకిరాలలో ఆదివారం మించాలపాడుకు చెందిన సింగంశెట్టి నాగమధు, మిర్యాల సైదులు అనే టీడీపీ కార్యకర్తలు ఏజెంట్లుగా ఉండేందుకు ఫారంలు పూర్తి చేస్తున్నారు. ఈ సమయంలో సుమారు 15 మంది వైసీపీ గూండాలు కర్రలతో పోలింగ్ బూత్‌వద్దకు వచ్చి ఏజెంట్లకు నిలబడేటంత మొనగాళ్లారా మీరు.. చంపేస్తాం.. అంటూ దాడులు చేశారు. ఈదాడిలో టీడీపీ కార్యకర్తలు సింగంశెట్టి నాగమధు తలకు గాయం కాగా, మిర్యాల సైదులు చేతికి గాయమైంది. దాడి జరిగే సమయంలో పోలీసు కానిస్టేబుల్ ఒకరు మాత్రమే ఉన్నారని, గొడవ జరుగుతున్నప్పటికీ అతను కూడా పక్కకు వెళ్లిపోయాడని గ్రామస్తులు చెబుతున్నారు. వైసీపీకి చెందిన బొజ్జా వెంకటనారాయణ, మూఢావత్ శ్రీను, కనకరాజు వెంకయ్య, రాజేష్, పోట్లూరి లక్ష్మయ్య, నాగయ్య, మంగమ్మ, పసుపులేటి వెంకటేశ్వర్లు, చిన్ని, బూదాని అంజి, కొంగా నాగేశ్వరరావు, ఉడతల జగన్‌తోపాటు మరికొందరు తమపై దాడిచేసినట్లు బాధితులు తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు బాధితులు దుర్గి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు.



గుంటూరులో ఓ అన్నా క్యాంటిన్ దుస్థితి ..



పిచ్చి మొక్కల మధ్య నరసరావుపేట స్టేడియం వద్ద అన్న క్యాంటీన్

పేదల కడుపు కొట్టారు

- వైసీపీ కుట్రతో అన్న క్యాంటీన్ల మూత
- ఐదేళ్ల క్రితం ఆకలి తీర్చిన భోజనాలయాలు
- పేరు, రంగులు మార్చి పాడు పెట్టిన జగన్

(గుంటూరు,నరసారవుపేట/ఆంధ్రజ్యోతి, తెనాలి అర్బన్)

అన్న క్యాంటీన్లు.. నాడు పేదల ఆకలి తీర్చే భోజనాలయాలు. నేడు చెత్తాచెదారాలతో నిండి శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యకలాపా లకు నిలయాలు. అన్నార్తులకోసం చంద్రబాబు ముఖ్య మంత్రిగా అతి తక్కువ ధరకు, నాణ్యమైన ఆహారాన్ని అందిం చేందుకు మున్సిపల్ కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. నిత్యం పేదలు, దినసరి కూలీలు, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే వారి ఆకలి తీర్చేలే ఈ అన్నక్యాంటీన్లను రూపొం దించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారం లోకి వచ్చీరాగానే జగన్ సీఎం పీఠం ఎక్కు తూనే వాటికి మరణశాసనాన్ని లిఖించారు. తొలుత పార్టీ రంగులు అద్దించారు.. ఆపై పేరు మార్చారు.. అయినా వీటిని కొనసాగిస్తారని ఆశించిన పేదలకు 58 నెలలుగా నిరాశే ఎదు రైంది. అన్న క్యాంటీన్ల ఉనికే లేకుండా చేసేశారు. కరోనా సమయంలో జగన్ మనస్సు కరిగి రాజన్న క్యాంటీన్ల (అన్న క్యాంటీన్ల)ను కొనసాగి స్తారని అందరూ ఆశించారు. అయితే ప్రభుత్వం ఆ దిశగానే ఆలోచన చేయలేదు. తమిళనాడులో అమ్మ క్యాంటీన్ల స్ఫూర్తితో చంద్రబాబు రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల పేరుతో అదే విధానాన్ని అమల్లోకి తీసుకురాగా సీఎం జగన్ వాటిని పాడుబెట్టేశారు. నిత్యంసూర్యోదయాన రుచికరమైన ఫలహారాన్ని, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని రూ.5 చొప్పున వడ్డించేవారు. కూలినాలి చేసుకునేవారు భోజనానికి ఇబ్బంది లేదన్న భరోసా అన్న క్యాంటీన్లతో ఏర్పడింది. పేదల ఆకలి తీర్చేందుకు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉన్న ఈ కేంద్రాలు పేదల భోజన ఆలయాలుగా విలసిల్లాయి. వీటితో చంద్రబాబుకి మంచిపేరు రావడం జీర్ణించుకోలేకనే జగన్ మూతేయిం చారని పలువురు విమర్శించినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు.



అన్నక్యాంటీన్‌లో ఆహార పట్టిక

పక్క రాష్ట్రాల్లో కొనసాగింపు.

తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారినా అక్కడ అధికారంలోకి వచ్చిన వారు విధానాలను మార్చలేదు. పేదల ఆకలి తీర్చే భోజన ఆలయాలను యథాతథంగా కొనసాగిం చారు. అయితే ఇక్కడ అంతా రివర్స్‌గా వ్యవహరించిన వైసీపీ నేతలు పేదల కడుపుపైనా కొట్టారు. పేదలకు మూడు పూటలా ఆహారాన్ని అందిస్తూ సర్వత్రా ఆదరణపొందిన అన్న క్యాంటీన్లతో చంద్రబాబుకు పేరు వస్తుందని తొలుత రంగులు మార్చారు, ఆతర్వాత తండి పేరు పెట్టుకు న్నారు. అయినా కక్ష తీరని ప్రభుత్వం ఏకంగా వాటిని పాడుపెట్టేసింది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధి లోని అన్నక్యాంటీన్ల భవనాల నిర్వహణను సంబంధిత అధికారులు గాలికొది లేశారు. దీంతో ఆయాభవనాల్లో వ్యర్థాలు పెరుకుపోయాయి. కొన్ని దగ్గర్ల అసాంఘీక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయి. ఆకలి తీర్చిన భవనాలు శిథిలా వస్థకు చేరుకోవడంతో పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు నగరంలోని మిర్చియార్డు, చుట్టుగుంట, నల్లచెరువు, అమరావతిరోడ్డు, పల్నాడు బస్టాండ్, నందివెలుగురోడ్డులో, తెనాలిలో మార్కెట్ సెంటర్, బస్‌స్టేషన్, మార్కెట్ యార్డు, నరసరావుపేట సేడియం వద్ద ఉన్న ఈ భవనాలు ప్రస్తుతం కనిపించనంతగా పిచ్చి మొక్కలతో నిండిపోయాయి.



నరసరావుపేటలో అధ్వాన్నంగా మార్కెట్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్



తెనాలి బస్ స్టేషన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్

ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

భట్టిప్రోలు, మే 12: ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని చింతమోటు గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదలంక కాకులడొంక నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి మండలంలోని చింతమోటు గ్రామం వద్ద బోల్తా కొట్టింది. ఈ ఘటనలో పెదలంక గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దున్నా శ్రీధర్ (27) ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



గల్లా జయదేవ్‌తో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పెమ్మసాని చంద్రశేఖర్‌తో

ఎంపీ గల్లా జయదేవ్ భేటీ

గుంటూరు, మే12(ఆంధ్రజ్యోతి): గుంటూరు సిట్టింగ్ ఎంపీ గల్లా జయదేవ్ సోమవారం తన ఓటు హక్కుని వినియోగించుకు నేందుకు ఆదివారం సాయంత్రం గుంటూరుకు చేరుకున్నారు. ఆయన పశ్చిమ నియోజకవర్గంలో తన ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎంపీ గల్లా జయదేవ్ వచ్చిన విషయం తెలుసుకున్న గుంటూరు పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎంపీ గల్లా జయదేవ్‌ను విందుకు ఆహ్వానించారు. ఈమేరకు ఆదివారం రాత్రి ఎంపీ గల్లా జయదేవ్ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నివాస గృహానికి చేరుకొని ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ గల్లాను పెమ్మసాని చంద్రశేఖర్ దుశ్శాలువా, బొకేతో ఘనంగా సత్కరించారు.

అదనపు బోగీ ఇచ్చారు..

పీఆర్ఎస్‌లో చూపలేదు

- సికింద్రాబాద్ - రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణీకుల ఇక్కట్లు

గుంటూరు,మే12 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్ -రేపల్లె ఎక్స్‌ప్రెస్‌కి అదనపు స్లీపర్ క్లాస్(ఎస్ఈ1) భోగిని జత చేసి దానికి సంబంధించి పీఆర్ఎస్‌లో ఎనేబుల్ చేయడాన్ని రైల్వేశాఖ మరిచింది. దాంతో ఆదివారం వెయిటింగ్ లిస్టులో ఉన్న ప్రయాణీకుల్లో ఏ ఒక్కరికి కూడా టిక్కెట్‌లు కన్‌ఫర్మ్ కాలేదు. ఈకారణంగా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడి జిల్లాకు చేరుకొ న్నారు. సాదారణంగా వెయిటింగ్ లిస్టులు చాంతాడంత ఉంటే అదనపు భోగీలను ఏర్పాటు చేసి కొంతమేరకు వాటిని క్లియర్‌చేస్తారు. ఆవిధంగా రేపల్లె ఎక్స్‌ప్రెస్‌కి ఆదివారం వెయిటింగ్ లిస్టులో 300లకు పైగా టిక్కెట్‌లు బుక్ అయ్యాయి. వీరంతా హైదరా బాద్‌లో నివసిస్తూ ఓటు వేసేందుకు స్వస్థలాలకు బయలుదేరిన వారే. అదే ఎస్ఈ-1 భోగీని పీఆర్ఎస్‌లో ఎనేబుల్ చేసి ఉంటే కనీసం 70మందికి పైగా బెర్తులు కన్‌ఫర్మ్ అయ్యేవి. అలానే మరి కొంత మందికి కనీసం కూర్చోవడానికి ఆర్ఏసీ సీట్లు వచ్చేవి. రైల్వే శాఖ చేసిన తప్పిదం కారణంగా ఎస్ఈ-1 భోగీలో ఎవరు పడితే వారు ఎక్కారు. ప్రయాణీకుల మధ్యన గొడవలు కూడా జరిగాయి.

మూడు ముక్కలాటతో

రాష్ట్ర పరువు గంగపాలు

- 1608వ రోజుకు రైతుల నిరసనలు, ఆందోళనలు

తుళ్లూరు, మే 12: ఒక్క ఛాన్స్ ఇవ్వండి పరిపాలన ఎంతో ఉన్నతంగా చేసి చూపిస్తానని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి.. ఈ ఐదేళ్లలో ఎక్కడ అభివృద్ధి అనేది లేకుండా చేశారని రాజధానికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద ఉండి మహిళలు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1608వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, జగన్‌రెడ్డికి రెండవ ఛాన్స్ ఇస్తే ఆంధ్రుల మనుగడే ఉండదన్నారు. వైసీపీకి ఓటు వేస్తే అరాచక శక్తులు రాజ్యమేలుతాయని స్పష్టం చేశారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారన్నారు. వార్షిక కౌలు ఇవ్వకుండా రైతులను పస్తులు పెడుతున్నారన్నారు. రాజధాని కోసం జీవనాధారమైన భూములిస్తే నరకం చూపిస్తున్నారని ఆవేద వ్యక్తం చేశారు. సీఎం జగన్‌రెడ్డి పరిపాలన చేసిన ఈ ఐదేళ్లలలో రాష్ట్రానికి ఏ ఒక్క పరిశ్రమ వచ్చిన ధాఖలాలు లేవన్నారు. నిరుద్యోగ యువత పెరిగిపోయిందన్నారు. అమరావతి అభివృద్ధి కొనసాగితే లక్షల ఉద్యోగాలు వచ్చేవన్నారు. మూడు రాజధానుల ప్రతిపాదన జగన్‌రెడ్డికి సొంత ప్రయోజనం కోసమేనన్నారు. అభివృద్ధి చేసే నాయకుడికి ఓటు వేయాలని విన్నవించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో రైతుల నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి.



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి

● జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్‌బాషా



పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, మే 12 : పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సిబ్బంది విధులు సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ యంత్రాలు, సామగ్రి పంపిణీ విధానాన్ని ఆర్‌వో సీహెచ్ శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛగా ఓట్లు వేసే పరిస్థితులు కల్పించామని, ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేలా చూడాలన్నారు. ఎన్నికలలో ముఖ్యమైన ఘట్టంలోకి వెళుతున్న అంశాన్ని ఉద్యోగులంతా గుర్తించి చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. రీ పోలింగ్ జరగకుండా అధికారులు చూడాలన్నారు. వెబ్‌క్యాస్టింగ్ ద్వారా నిరంతరం నిఘా ఉంటుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా పోలింగ్ యాంత్రాలు ఉంటాయనే విషయాన్ని సిబ్బంది గుర్తుంచుకోవాలన్నారు. ఓటింగ్ సరళిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పరిస్థితులపై దస్త్రాలలో నిక్షిప్తం చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది నిష్పక్షపాతంగా పని చేయాలని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. ఓటింగ్ ప్రారంభానికి ముందుగానే విధిగా మాక్‌పోల్ నిర్వహించాలన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే ఉద్యోగులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చీరాల ఆర్‌వో జి.సూర్యనారాయణరెడ్డి, మున్సి పల్ కమిషనర్ బి.శ్రీకాంత్, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.



విధులకు హాజరయ్యేందుకు వచ్చిన పోలింగ్ సిబ్బంది

భోగిరి ప్రసాద్ మృతి పార్టీకి తీరనిలోటు

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ



ప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నరేంద్రవర్మ

బాపట్ల, మే 12 : స్టువర్టుపురం సర్పంచ్, తెలుగుదేశం పార్టీనాయకుడు భోగిరి ప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి బాపట్ల నియోజకవర్గ ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగిరి ప్రసాద్ మృతి టీడీపీకి తీరని లోటు అన్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రసాద్ మరణం అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఓ మంచి నాయకుడిని కోల్పోవటం అత్యంత దురదృష్టకరమని వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని నరేంద్రవర్మ తెలిపారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

● పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన 1500 మంది సిబ్బంది
● 18 రూట్‌లలో 47 మంది మైక్రో అబ్జర్వర్లు



పోలింగ్ సిబ్బందికి ఆర్డర్‌లు జారీ చేస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ సీహెచ్ శ్రీధర్, ఏఆర్‌వోలు శ్రావణ్‌కుమార్, బి.శ్రీకాంత్

బాపట్ల, మే 12 : సార్వత్రిక ఎన్నికలకు బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం సిద్ధమైంది. నియోజకవర్గంలోని బాపట్ల పట్టణ, మండలంతో పాటు కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో మొత్తం 202 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆయా పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించేందుకు 1500 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బందికి ఈవీఎం యంత్రాల డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక బాపట్ల పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేశారు. బాపట్ల నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ పర్యవేక్షణలో ఎన్నికల సిబ్బందికి తమ పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన ఈవీఎం యంత్రాలను డిస్ట్రిబ్యూషన్ చేశారు. సాయంత్రం 4 గంటలు నుంచి ఎన్నికల అధికారులు తమ ఈవీఎం యంత్రాలతో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు వాహనాలలో బయలుదేరి వెళ్ళారు. పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న ఎన్నికల సిబ్బందికి, ఈవీఎం యంత్రాలకు పోలీసు భద్రతను ఏర్పాటు చేయగా బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ ఎప్పటికప్పుడు బందోబస్తు వివరాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని 18 రూట్‌లుగా 18 సెక్టార్‌లలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. 47 మంది మైక్రో అబ్జర్వర్లు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.



పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం యంత్రాలతో బయలుదేరి వెళుతున్న ఎన్నికల సిబ్బంది

సిబ్బందిని తరలించేందుకు 46 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 20 శాతం సిబ్బందిని రిజర్వు చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలు నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేసినట్లు వివరించారు. కార్యక్రమాన్ని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు ఎం.శ్రావణ్‌కుమార్, బి.శ్రీకాంత్ తదితర సిబ్బంది పర్యవేక్షించారు. పోలీసు బందోబస్తు నడుమ పోలింగ్ సిబ్బందిని సామగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ముమ్మరం చేశారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వద్ద భారీకేడ్‌లు ఏర్పాటు చేసి ఓటర్లకు ఇబ్బంది లేకుండా చేశారు. కొల్లూరు గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన ఉపాధ్యాయురాలు కె.ఎస్.ఎస్.మంజుల ఎన్నికల విధులు నిర్వహించేందుకు రాగా ఆమె నడవలేని పరిస్థితిని గమనించిన రిటర్నింగ్ ఆఫీసర్ ఆమెకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వటంతో తిరిగి వెళ్ళింది. పోలింగ్‌సిబ్బంది కోసం పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో భోజన సౌకర్యం కల్పించినప్పటికి కేవలం రెండు కౌంటర్లు మాత్రమే పెట్టటంతో మధ్యాహ్న సమయంలో భోజనం కోసం బారులు తీరిన సిబ్బంది నానా ఇబ్బందులు పడ్డారు.



పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న పోలింగ్ సిబ్బంది

కర్లపాలెం మండలంలో...



కర్లపాలెంలో ఏజెంట్‌లకు పత్రాలను అందజేస్తున్న పోలింగ్ అధికారి వెంకటరమణ

కర్లపాలెం, మే 12 : కర్లపాలెం మండలంలో సోమవారం జరగబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు 47 పోలింగ్ బూత్‌లలో ఓటర్లు ఓట్లు వేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కర్లపాలెం తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. మండలం మొత్తంలో 47 పోలింగ్ బూత్‌లు 40,976 ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 20,215, మహిళలు 20,761 మంది ఉన్నారన్నారు. పోలింగ్ అధికారులు, సహపోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు మొత్తం కలిపి మండలంలో 282మంది సిబ్బంది ఎన్నికలలో విధులలో పాల్గొంటారన్నారు. కర్లపాలెం మండలంలోని పేరలి, కర్లపాలెం, పాతనందాయపాలెం, నల్లమోదువారిపాలెం, పెదగొల్లపాలెం, గణపవరం, పెదపులుగువారిపాలెం గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద వీడియోగ్రాఫర్స్‌ను ఏర్పాటు చేసి మైక్రో అబ్జర్వర్స్‌ను నియమించామన్నారు. ఆయా గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ఏర్పాట్లు చేశామన్నారు. మండలంలోని ఓటర్లు అందరు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నిర్మలానందబాబా కోరారు. మండలంలోని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, ఓటర్లు, నాయకులు, అన్నివర్గాల ప్రజలు ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు ఎన్నికల సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.



బాపట్లలో భోజనం కోసం బారులు తీరిన పోలింగ్ సిబ్బంది

ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

● ఎస్పీ వకుల్ జిందాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, మే 12 : జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మొబైల్‌యాప్ ద్వారా ఈవీఎం బాక్స్‌లకు, పోలింగ్‌సిబ్బందికి రూట్ మొబైల్ పార్టీలు ఎస్కార్ట్ నిర్వహిస్తూ పోలింగ్ కేంద్రాలకు చేర్చే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్ధ్ మొబైల్ యాప్ ద్వారా జిల్లాలో జరుగుతున్న ఎన్నిక ప్రక్రియను కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ ప్రెస్ చేస్తే పోలీసు అధికారులు ఆప్రదేశానికి చేరుకోవటానికి ఎంత సమయం పడుతుందనే విషయంపై ప్రత్యేకంగా డెమో వీక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కడైన శాంతిభద్రతలకు విఘాతం కలిగిన, గొడవలు జరుగుతున్న ఆ ప్రదేశానికి పోలీసులు, కేంద్ర సాయుధ బలాలు వెంటనే చేరుకునేందుకు జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలను సులువుగా గుర్తించేందుకు ఏ పోలీసు అధికారి ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు అనే విషయాలను తెలుసుకునేందుకు ఏ అధికారి పరిధిలోనైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే అతడు యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్‌నొక్కితే ఆ అధికారి ఎరుపు రంగులోకి సూచించబడి తద్వారా మొబైల్ పార్టీలు గూగుల్ నామినేషన్ విధానం ద్వారా ఆ ప్రదేశానికి వేగంగా చేరుకొని శాంతిభద్రతలను పరిరక్షిస్తారన్నారు.

సిబ్బంది నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి : ఎస్పీ

బాపట్ల రూరల్, మే 12 : సిబ్బంది నిష్పక్షపాతంగా, నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. బాపట్ల నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించనున్న పోలీసు అధికారులకు, సిబ్బంది, ఎక్స్ ఆర్మీ ఉద్యోగులకు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ఆదివారం బాపట్ల పట్టణంలోని బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల ముందురోజు నిర్వహించాల్సిన విధులు గురించి దిశ, నిర్దేశం చేశారు.

ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి

పిట్టలవానిపాలెం, మే 12 : మండలంలోని 14 గ్రామ పంచాయతీలలోని 34 పోలింగ్ కేంద్రాలలో మండల ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని చందోలు ఎస్సై టి.అనీల్‌కుమార్, మండల తహసీల్దార్ కె.స్ఫూర్తి ఆదివారం తెలిపారు. ప్రతి ఒక్క ఓటరు ఆయా పార్టీల నాయకులు ఎన్నికల దృష్ట్యా విధులు నిర్వహించే అధికారులకు ఎలాంటి ఆటంకం కలగకుండా సహకరించాలని వారు తెలియజేశారు. అవాంఛనీయ సంఘటన పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చందోలు ఎస్సై టి.అనీల్‌కుమార్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేవిధంగా తమవంతు సహకారం అందజేయాలని ఆయా పార్టీల నాయకులకు, ఓటర్లకు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు సూచించిన మేరకు 100 మీటర్ల దూరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రేపల్లె, మే 12 : నిజాంపట్నం మండలం అచ్చుతపురం గ్రామం దగ్గర నిజాంపట్నం నుంచి వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం రేపల్లె మండలం పెనుమూడి నుంచి నిజాంపట్నం వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఆదివారం సాయంత్రం ఢీకొనటంతో పెనుమూడికి చెందిన కొక్కిలిగడ్డ నాగరాజు(21) మృతి చెందాడు. నిజాంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేమూరు.. ప్రజాగళం..

- వ్యక్తిగతంగా ఆనందబాబుకు పెరిగిన ఇమేజ్
- వైసీపీ పాలనలో నష్టపోయామంటున్న ప్రజలు
- అధికార పార్టీపై ఆగ్రహిస్తున్న యువత, గృహిణులు
- అంతా నష్టం జరిగిందంటున్న రైతన్నలు

వేమూరు, మే 12: వైసీపీ ఐదేళ్ళ పాలనలో తీవ్రంగా నష్టపోయామంటూ.. ఈ సారి టీడీపీకే ఓటు వేస్తామని ప్రజలు తమ మనో భావాల్ని వ్యక్తపరుస్తున్నారు. రైతులు, గృహిణులు, యువత కులవృత్తి పనుల వారు ఇలా ఎవరిని ప్రశ్నించినా ముఖ్యమంత్రి జగన్ నవరత్నాల పేరుతో తమను నయవంచన చేశాడని ఆగ్రహం వ్యక్త పరుస్తున్నారు. నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో ఎంతో ఆశతో వైసీపీకి ఓటు వేశామని తద్వారా స్థానికంగా ఎమ్మెల్యే అయిన వ్యక్తి మంత్రి హోదాలో ఉండి కూడా ఎలాంటి అభివృద్ధి చేపట్టక లేదని విమర్శిస్తున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి ప్రజల మనిషిగా ఆనంద బాబు ఎంతో అభివృద్ధిని చేసి చూపారని, వర్గ విబేధం లేకుండా సంక్షేమ ఫలాలు అందించిన ఆయన ఆయనకే చెల్లిందన్నారు. అలాంటి వ్యక్తికి గత ఎన్నికల్లో ఓటు వేయకుండా ద్రోహం చేశామని అనేకమంది తమ బాధను వ్యక్తపరుస్తున్నారు. సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆనందబాబును గెలిపించుకుందామని, తద్వారా చంద్రబాబు పాలనతో తమకు మంచి జరుగుతుందనే భావనను వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్ళలో నష్టపోయిన యువత..



వైసీపీ పాలనలో ఉద్యోగ అవకాశాలు లేక యువత ఎక్కువగా నష్టపోయాం. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే మళ్ళీ మాకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నిరుద్యోగ సమస్యను నివారించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జగన్ ఎలాంటి చర్యలు చేపట్టలేదు, పరిశ్రమలు, ఐటీలో పురోగతి లేకపోడంతో ఉద్యోగాలు లేకుండా పోయాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కావాలి. కూటమి అభ్యర్థులు గెలవాలి.

- గుండపనేని హర్షిత, జంపని, వేమూరు మండలం

రైతు క్షేమం పట్టించుకోని జగన్..



రైతుల పక్షపాతి అని చెప్పుకోవడమే కాని వారి క్షేమం గురించి జగన్ పట్టించుకోలేదు. తుఫాన్ నష్టపరిహారం అందించే విషయంలో సకాలంలో స్పందించకపోగా పరిహారాన్ని కూడా రైతులకు అందించలేని నిస్సహాయ ముఖ్యమంత్రిగా ఆయన నిలిచిపోయాడు. రైతు క్షేమం కోసం పాటుపడని ఏ నాయకుడైనా నష్టపోతాడు. ఈ దఫా ఎన్నికల్లో రైతులు ఈ ఐదేళ్ళలో తమకు జరిగిన నష్టాన్ని జగన్‌కు చూపించబోతున్నారు. కూటమి అభ్యర్థులకే రైతులు పూర్తి మద్దతు ఉంది.

- మునిపల్లి ఏసుబాబు, రైతు, కొల్లూరు

నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు



చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే తమకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. జగన్ పాలనలో ఎక్కడా ఉపాధి అవకాశాలు లేక యువత నిరుద్యోగంతో అనేక ఇబ్బందులు పడ్డారు. యువత మొత్తం సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుకు మద్దతు పలుకుతూ కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని నిర్ణయానికి వచ్చారు. ఐదేళ్ళ పాటు నియోజకవర్గ గ్రామాల్లో అభివృద్ధి లేకుండా పోయిందని, టీడీపీ పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి ప్రజలకు అందించిన ఆనందబాబుకు యువత మొత్తం మద్దతు తెలుపుతుంది.

- కె.కృష్ణచైతన్య, అమృతలూరు

పథకాలతో మోసం..



సంక్షేమ పథకాల పేరుతో జగన్ ఐదేళ్ళ పాటు పూర్తిగా మోసం చేశాడు. గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా ఈ ఐదేళ్ళ జగన్ పాలనలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యాయి. గత ప్రభుత్వంలో విద్యుత్ బిల్లు 300నుంచి 400లు వచ్చేది, అదే బిల్లు ఇప్పుడు వెయ్యి నుంచి మూడు వేల దాకా పెరిగిపోయింది. సమావేశాలకు రాకపోతే పథకాలు తీసివేస్తామని డ్వాక్రా మహిళలను బెదిరించడంతో పాటు అనేక ఇబ్బందులను పెట్టారు. జగన్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధం ఉన్నారని ఆనందబాబు హయాంలో అన్ని గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు పేద కుటుంబాలు సైతం ఆర్థింగా పరిపుష్టిగా ఉన్నాయి.

- తాడికొండ హనుమాయమ్మ, కుచ్చెళ్ళపాడు

నేతన్నలకు అన్యాయం..



నేతన్న నేస్తం పథకం అమలులో మాకు అన్యాయం జరిగింది. చేనేత వృత్తిని నమ్ముని జీవనం చేసే ఎన్నో పేద కుటుంబాలు ఆ పథకం అందలేదు. చేనేత దారులకు ఎంత ప్రయోజనం చేకూరుస్తానని జగన్ డాంబికాలతో కాలం గడిపారు. సొంత మగ్గం లేని వారికి పథకాలు అందకుండా పోయాయని, ఇంకా పేద నేతన్నలకు జగన్ చేసింది ఏమిటి. కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే చేనేతలకు ప్రయోజనం చేకూరుతుంది. అందు కోసం కూటమి అభ్యర్థులైన ఆనందబాబు, తెన్నేటి కృష్ణప్రసాద్‌లకు మా మద్దతు పలుకుతాం.

- ఆకురాతి భాస్కరరావు, నేత కార్మికుడు, భట్టిప్రోలు

తీరం.. రాజకీయ చైతన్యం

- సార్వత్రిక ఎన్నికల్లో రేపల్లె వాసులు ఏడుగురు అభ్యర్థులు
- రాజకీయాల్లో రాణింపు



అనగాని సత్యప్రసాద్



మోపిదేవి శ్రీనివాసరావు



డాక్టర్ ఈవూరి గణేష్



తెనాలి శ్రావణ్‌కుమార్



అంబటి రాంబాబు



అంబటి మురళీకృష్ణ



బూరగ సుబ్బారావు

రేపల్లె, మే 12: రాజకీయ చైతన్యం కలిగిన తీరప్రాంతం రేపల్లె. ఎంతోమంది నాయకులను తీర్చి దిద్ది రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. ఉమ్మడి రాష్ట్రంలో రేపల్లె, కూచినపూడి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులుగా ఎమ్మెల్సీలుగా, ఎంపీగా రాణించారు. డిలిమిటేషన్ తరువాత కూచినపూడి నియోజకవర్గాన్ని రేపల్లె నియోజకవర్గంలో కలిపారు.

ప్రస్తుతం రేపల్లె ప్రాంతానికి చెందిన ఏడుగురు అభ్యర్థులు ఎన్నికల పోటీల్లో నిలబడ్డారు. నియోజకవర్గంలోని రేపల్లెకు చెందిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్ పోటీ చేస్తున్నారు. ఈయన మూడుసార్లు రేపల్లె నియోకజవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చెయ్యగా ఒక్కసారి ఓటమి చవి చూచి 2014, 2019ల్లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. నాలుగోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ పోటీ అభ్యర్థిగా నిలిచారు. రేపల్లె మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన తెనాలి శ్రావణ్‌కుమార్ విద్యాభ్యాసం రేపల్లెలోనే జరిగింది. ఉద్యోగ విధులు రాణిస్తూ టీడీపీ అభ్యర్థిగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తాడికొండలో పోటీ చేసి 2014లో గెలుపొందగా, 2019లో ఓటమి చెందారు. ప్రస్తుతం తాడికొండ టీడీపీ అభ్యర్థిగా నిలబడ్డారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లికి చెందిన డాక్టర్ ఈవూరి గణేష్ తల్లిదండ్రులు ఎమ్మెల్యే, మంత్రులుగా విధులు నిర్వహించారు. కుమారుడు ఈవూరి గణేష్ వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల్లోపోటీ చేస్తున్నారు. రేపల్లె పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది అంబటి ఆంజనేయులు కుమారుడు అంబటి రాంబాబు రేపల్లె ఎమ్మెల్యేగా చేశారు. తరువాయి పర్యాయం ఓడిపోవటంతో గుంటూరులో నివాసం ఉన్నారు. 2014లో సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిని చవి చూశారు. 2019లో వైసీపీ తరుపు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. 2024లో సత్తెనపల్లి వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. అంబటి మురళి విద్యాభ్యాసం మొత్తం రేపల్లెలో జరిగిన వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌గా విధులు నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పొన్నూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. రేపల్లె పట్టణానికి చెందిన మోపిదేవి శ్రీనివాసరావు కాంగ్రెస్‌పార్టీ తరుపున 2014, 2019లో రెండుసార్లు పోటీలో నిలబడి ఓటమి పాలయ్యారు. 2024లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చెయ్యనున్నారు. రేపల్లె పట్టణానికి చెందిన బూరగ సుబ్బారావు రేపల్లె ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించారు. 2024లో వేమూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేయుచున్నారు.రేపల్లె ప్రాంతానికి చెందిన ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఉమ్మడి జిల్లాలో పోటీ చేస్తుండటం ప్రాంత ప్రాధాన్యం సంతరించుకుంది.

జగనన్న కాలనీల్లో.. కష్టాలు

- మౌలిక వసతులు నిల్
- బిల్లులు జాప్యంతో బేస్‌లెవల్‌ల్లోనే ఆగిపోయిన గృహాలు
- నేటికి నిర్మాణం చేపట్టని రహదారులు డ్రైయినేజీ
- తాగునీరు అందక కాలనీవాసులు ఇబ్బందులు

రేపల్లె, మే12: జగనన్న కాలనీలో గృహాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చెయ్యకపోవటంతో గృహాలు బేస్‌మెంట్ లెవల్‌ల్లోనే నిలిచిపోయాయి. కొన్ని గృహాలు నిర్మించుకున్న ఫైనల్ బిల్లు కాక గృహ యజమానులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు డ్రైయినేజీలు నిర్మాణాలు చేపట్టకపోవటంతో మురుగునీరు పోయే పరిస్థితి లేక నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికి పలుమార్లు మున్సిపల్ గృహనిర్మాణ శాఖాధికారులకు బిల్లులు మంజూరు చేయించాలంటూ ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేదని గృహ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జగనన్న కాలనీలో డ్రైయిన్‌లు, రహదారులు నిర్మాణం చెయ్యకపోవటంతో రబ్బీస్‌రోడ్డులోనే అవస్థలు పడుతున్న ప్రజలు

జగనన్న కాలనీ ఇలా....

పురపాలక సంఘంలోని 18వవార్డులో జగనన్న కాలనీలో 3,008మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. వాటిల్లో సుమారు 1800 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 1208 గృహాలు వివిద దశల్లో బిల్లులురాక కొంతమంది ఆర్థిక పరిస్థితులు బాగోక నిర్మాణాలు చేపట్ట లేదు. బేస్‌మెంట్ లెవల్ లెంటల్స్ పిల్లర్సు వరకు వేసి వదిలేశారు. గృహాలు నిర్మించుకున్న వారికి చివరి రెండు బిల్లులు పడక నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం పైనుంచి నిధులు రాకపోతే మేముఏమీ చేస్తామంటూ సమాధానం చెబుతున్నారని గృహనిర్మాణదారులు వాపోతున్నారు. నిర్మించుకున్న గృహాలకు నేటికి రహదారుల నిర్మాణం చేపట్టకపోవటం గృహాలకు డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవటంతో ఇళ్ళల్లో నుంచి వచ్చే మురుగునీరు బయటకు వెళ్ళే పరిస్థితి లేక రహదారిపైకి వ్యర్థనీరు వెళ్ళి ఇబ్బందులకు గురౌవుతున్నామన్నారు. గృహాలు నిర్మించుకోగానే తాగునీరు అందిస్తామని పలుమార్లు అధికారులు తెలిపారని, నేటికి పైప్‌లైన్లు వేసిన దాఖలాలులేవని, బోర్లు వేసుకున్న ప్రాంతంలో మంచినీరు రావటంతో నిత్యం రోజుకు రూ.100 పెట్టి తాగునీరు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1200గృహాల పైనే నిర్మాణ దశలో ఉన్నాయని, వాటికి బిల్లులు మంజూరు చెయ్యమని అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా సమాధానం చెప్పే పరిస్థితి కూడా లేదన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ మీదగా ప్రధాన డ్రైయినేజీని నిర్మించారు. ఆ డ్రైయిన్‌పై అధికారులు ఎవరు దృష్టి సారించకపోవటంతో డ్రైయిన్‌లో ఏపుగా తూటికాడ, పిచ్చి చెట్లు, పెరిగిపోయి వ్యర్థాలతో పూడుకుపోతుంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టిసారించి డ్రైయిన్లు మరమ్మత్తులు నిర్మిస్తే మురుగునీరు పారుదలయ్యే పరిస్థితి నెలకొంటుంది. మున్సిపల్ అధికారులకు తెలిపిన చెత్తాచెదారాన్ని తొలగించిన పరిస్థితి లేదంటూ వాపోతున్నారు.



పట్టణంలోని 18వ వార్డులో జగనన్న కాలనీలో డ్రైయిన్‌లో ఏపుగా పెరిగిన తుంగ, తుమ్మచెట్లు

చెప్పింది ఘనం.. చేసింది స్వల్పం

- సరస్వతీ నిలయాల పట్ల నిర్లక్ష్యం
- బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో 1050మంది విద్యార్థుల ఇక్కట్లు

బాపట్ల, మే 12: నాడు-నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నట్లు ఊకదంపుడు ఉపన్యాసాలు చేసే పాలకులు చెప్పే అధికారులు ఆదిశగా పనులు మాత్రం చేయలేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. 2018- 2019వ సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ శ్రీరామ్‌మాల్యాద్రి కృషితో ఎస్సీసబ్ ప్లాన్ నిధులు వెచ్చించి బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో యు అకారంలో రెండంతస్థుల భవన సముదాయాన్ని నిర్మించారు. సబ్‌ప్లాన్‌నిధులు, 14వఆర్థిక సంఘ నిధులు సుమారు రూ.2కోట్లు వెచ్చించి నిర్మించిన ఈ భవనం పనులు పూర్తి చేయటానికి ఎన్నికలు రావటంతో అప్పట్లో బ్రేక్ పడింది. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పేరిట పాఠశాల అభివృద్ధికి రూ.78.57లక్షలు మంజూరు చేసింది. మంజూరు చేసిన నిధులతో కొత్తభవనం పనులు పూర్తిచేయకుండా పాతభవనం మరమ్మత్తులు, ఇతరపనులకు రూ.53.17లక్షలు మాత్రమే ఖర్చు చేసింది. మిగిలిన పనులు చేయకుండా వదిలేశారు. పాఠశాలలో 1050మందికిపైగా విద్యార్థులు ఉండటంతో చాలిచాలని గదులతో ఇబ్బంది పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ అధికారులు రెండోవ విడత నాడు-నేడు కార్యక్రమం ద్వారా కొత్తభవనం పనులు పూర్తి చేయించేందుకు రూ.71.66లక్షలు మంజూరు చేయించారు. అందులో ఇప్పటి వరకు రూ.44.32లక్షలు ఖర్చు చేసి గ్రౌండ్ ఫ్లోర్‌లో రూమ్‌లు ఏర్పాటు చేసి తలుపులు పెట్టి తరగతి గదులుగా వినియోగించుకుంటున్నారు. మిగిలిన రెండు ఫ్లోర్‌లు అలాగే ఉండిపోయాయి. చేసిన పనులు పూర్తి స్థాయిలో చేయకపోగా మిగిలిన పనులు చేయకుండా వదిలేశారు. పాతభవనం మరమ్మత్తులు చేసినప్పటికీ స్లాబ్ పెచ్చులూడి పడుతున్నది. విద్యార్థులకు ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోనే అత్యధిక శాతం విద్యార్థులు ఉన్న పాఠశాలగా బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఉంది. గతంలో 1300మందికిపైగా విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 1050 మంది చదువుతున్నారు. దీనిపై అధికారులు దృష్టిసారించి రాబోయే విద్యాసంవత్సరం నాటికి పూర్తి చేయించి విద్యార్థులకు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. నూతన ప్రభుత్వంలోనే ఈపనులు పూర్తయ్యే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన బాపట్ల మున్సిపల్ హైస్కూల్ భవన సముదాయం



బాపట్ల మున్సిపల్ హైస్కూల్ పాతభవనంలో స్లాబ్ పెచ్చులూడి పడుతున్న దృశ్యం

అభివృద్ధే విజయానికి సోపానం

- వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధం
- ఎమ్మెల్యే అనగాని



రేపల్లె, మే12: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలోని ప్రజలు అభివృద్ధికే, టీడీపీపై నమ్మకంతోనే అండగా నిలువనున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.3000 కోట్లతో నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. ప్రధాన సమస్యలైన రహదారులు, శిథిలావస్థలో ఉన్న పాఠశాలల అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, పట్టిసీమ నీటిని చివరి భూములకు అందించేలా కృషి చేశామన్నారు. 20 కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచి వైద్యసేవలు, నిత్యవసర వస్తువుల అందించి ఆదుకున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో హరిజనవాడలు, ఎస్టీ కాలనీల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు వేశామని తెలిపారు. గతంలో జరగని అభివృద్ధి ఈ అయిదు సంవత్సరాల్లో జరిగిందన్నారు. ప్రతిపక్షాలకు ప్రజలు ఓటు హక్కు ద్వారా గురువారం జరిగే ఎన్నికల్లో బుద్ధి చెప్పనున్నారని తెలిపారు. పదవిని కట్టబెట్టిన ప్రజలకు రుణం తీర్చుకునే విధంగా తమశక్తి వంచన లేకుండా అభివృద్ధి పనులు చేసి ప్రజలకు కావాల్సిన సమస్యలను పరిష్కరించటంలో ముందంజలో ఉన్నామన్నారు. నియోజకవర్గంలో 13500 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.9కోట్ల మేర ఆర్థిక సాయం అందించామన్నారు. రాష్ట్రం 16వేల కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కోట్లాది రూపాయలు విలువ చేసే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అండగా నిలిచారన్నారు. రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధిలో 30సంవత్సరాలు వెనక్కి తీసుకుని వెళ్ళారన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేశారని, రాజధాని నిర్మాణం చేపట్టకపోగా మూడు ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను విడగొట్టి రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన అవినీతి అరాచకాలతో ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, నేడు జరిగే ఎన్నికల్లో టీడీపీకే అండగా నిలిచే విధంగా ప్రజలు సిద్ధమయ్యారని ఎన్డీయే కూటమి అధికారంలోకి రానున్నదన్నారు. ప్రజలంతా తమకు అండగా నిలిచి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బరిలో ఫస్ట్‌టైమ్.. సేవల్లో ఫుల్ టైమ్



వేగేశన నరేంద్రవర్మ



తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, మే 12: బాపట్ల ఎన్నికల బరిలో ఫస్ట్‌టైమ్ పోటీ చేస్తున్న అభ్యర్థులు సేవారంగంలో మాత్రం ఎప్పటి నుంచో పనిచేస్తున్నారు. అంచెలంచలుగా ఆక్వారైతుగా, వ్యాపారవేత్తగా, పారిశ్రామికంగా ఎంతో పేరుగడించిన వేగేశన నరేంద్రవర్మ దశాబ్దకాలంగా వేగేశన ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గ ప్రజలకు విశేష సేవలందిస్తున్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, సామాజిక సేవలలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నియోజకవర్గంలోని ప్రతి కుటుంబాన్ని పేరుతో పలకరించే పరిచయం పెంచుకున్నాడు. వ్యాపార రంగంలో తనకు వచ్చే లాభాలలో ఎంతో సేవారంగానికి వెచ్చిస్తున్న ఆయన ప్రజలకు మరెన్నో సేవలు అందించాలనే సంకల్పంతో రాజకీయాలలోకి వచ్చినట్లు తెలిపారు. మొదటిసారిగా బాపట్ల బరిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన సేవలపట్ల నమ్మకంతో అనేకమంది మద్దతు తెలియజేస్తున్నారు. బాపట్ల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అందరి అభిప్రాయాలను ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సేవారంగంలో మేటిగా రాణించిన నరేంద్రవర్మ రాజకీయ రంగంలో కూడా విశేషంగా రాణించేందుకు అడుగులు వేస్తున్నారు.

- గోదావరి జిల్లాలో పేదకుటుంబంలో జన్మించిన తెన్నేటి కృష్ణప్రసాద్ కష్టపడి ఇష్టంతో చదువుకొని ప్రతి పరీక్షలో ఫస్ట్‌ర్యాంక్ సాధిస్తూ వచ్చాడు. మొదటి ప్రయత్నంలోనే ఐపీఎస్‌కు ఎంపికైన కృష్ణప్రసాద్ మూడున్నర దశాబ్దాలపాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలలో ఎఎస్పీ, ఎస్పీ, డిఐజి, ఐజిగా బాధ్యతలు నిర్వహించారు. 1999 నుండి 2004 వరకు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఈడీగా పనిచేసి హైటెక్‌సిటీ, ఔటర్ రింగ్‌రోడ్డు, శంషాదాబాద్ ఎయిర్‌పోర్ట్, సైబార్‌బాద్ నిర్మాణం వంటివి చేపట్టి ప్రత్యేకతను చాటుకున్నారు. ఉద్యోగవిరమణ తర్వాత కూపీ ఫౌండేషన్, మలుపు ఫౌండేషన్ వంటివి స్థాపించి లక్షలాదిమందికి సేవలందించిన కృష్ణప్రసాద్ మొదటిసారిగా రాజకీయాలలోకి వచ్చినట్లు తెలిపారు. రాజకీయాలలోకు కొత్త అయినప్పటికి సేవలలో మాత్రం ఫుల్‌టైమ్ కొనసాగుతున్నానని పేర్కొన్నారు. అధికారిగా ఉన్నప్పుడు ప్రజల కోసం తన కార్యాలయం గేట్లు తెరిచి ఉంచేవాడనని రాజకీయనాయకునిగా కూడా ప్రజల కోసం వారికి సేవలందించటం కోసం తన ఇంటి తలుపులు ఎప్పుడు తెరిచే ఉంచుతానని స్పష్టం చేశారు. ఈవిధంగా బాపట్ల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సేవారంగంలో ఎంతో కాలంగా ఉన్నప్పటికి రాజకీయాలలో మాత్రం మొదటిసారిగా పోటీచేస్తున్నారు. అన్నిరంగాలలో ఫస్ట్ మార్కులు సాధించిన వీరు రాజకీయంగా కూడా ఫస్ట్ ర్యాంక్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మా రోజుల్లో ఓటుపై అవగాహన లేదు

- రాను రాను ఓటు విలువ దిగజారుతోంది
- శతాధిక వృద్ధుడు సుబ్బారావు



మొవ్వ సుబ్బారావు

వేమూరు, మే 12: బ్రిటీష్ వారి కాలంలో ఓటు విలువ ప్రజలకు అంతగా తెలిసేది కాదని, ఓటు విలువ తెలిసిన కొద్దీ రాను రాను దాన్ని విలువ కూడా దిగజారుతోందని వేమూరుకు చెందిన శతాధిక వృద్ధ రైతు ముప్వ సుబ్బారావు ఆవేదన వ్యక్తపరిచారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 1924లో తాను జన్మించానని, 1942వ సంవత్సరంలో తొలి ఓటు వేయడం జరిగిందన్నారు. ఆ కాలంలో ఇంత విస్తృతంగా ప్రచారం ఉండేది కాదని, ఒక పెద్దమనిషి చెప్పిన మాట ప్రకారం ఓటు వేసే వారని తెలిపారు. తనకు 25 సంవత్సరాల వయస్సు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకే మొగ్గు చూపేవారని, అయితే బ్రిటీష్ వారి పాలనలో రైతును గౌరవించారని, వ్యవసాయాన్ని ప్రోత్సహించారని అన్నారు. ఆ విధానంలో ఈ రోజున ఏ ప్రభుత్వం రైతుకు సరైన న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. స్వాతంత్ర్య సమరయోధులు వెన్నం కోటయ్య, ఉయ్యూరు వెంకట్రామయ్యలాంటి పెద్దలు కొన్ని ఉద్యమాలు చేపట్టారని ఆ సందర్భాలలో కావూరు ఆశ్రమానికి వచ్చిన మహాత్మాగాంధీని గుంటూరుకు వచ్చిన జవహర్‌లాల్ నెహ్రూను రైతుల పక్షాన తాను కలవడం జరిగిందన్నారు. రాజకీయ దురంధరుడు అయిన ఆలపాటి వెంకటరామయ్య లాంటి నాయకులు ఈ రోజున సమాజంలో లేరని అన్నారు. ఎన్నికల సమయంలో ఈ రోజున ఓటును డబ్బుకు అమ్ముకోవడం జరుగుతోందని, పూర్వకాలంలో ప్రతి ఓటరు డబ్బుకు ఆశపడకుండా మాటకు కట్టుబడి ఉండేవారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మార్పు అవసరమని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ప్రధానిగా పనిచేసిన వాజ్‌పేయిని ఢిల్లీలో కలవడం జరిగిందని అలాంటి సిద్ధాంతాలకు లోబడి పనిచేసిన మంచి నాయకులు ఈ రోజున కరువయ్యారని అన్నారు. ఏదిఏమైనా ప్రస్తుత పరిస్థితుల్లో పాలకుల మార్పు అవసరమని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

» కేంద్రాలకు సామగ్రితో చేరిన సిబ్బంది
» డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్దకు బస్సులు వచ్చే అవకాశం లేక అవస్థలు
» పోలీసుల బందోబస్తు

అద్దంకి, మే 12 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. అద్దంకి నియోజకవర్గంలో అద్దంకి పట్టణంతో పాటు 5 మండలాలలో 298 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి పోలింగ్ అధికారులతో పాటు మొత్తం 6గురు సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఇక ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద కనీసం ఒకరు కు తగ్గ కుండా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. సుమారు 500 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. సెక్టార్ ఆఫీసర్‌లు, మొబైల్ టీమ్‌లు కూడా విధులు నిర్వహించనున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాల నుంచి ఎన్నికల సిబ్బందిని కేటాయించడంతో మధ్యాహ్నం వరకు వస్తునే ఉన్నారు. రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద సరైన వసతులు లేకపోవడంతో పోలింగ్ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఇక సాయంత్రం 4 గంటల నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సిబ్బంది పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన వాహనాలలో తరలివెళ్లారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్దకు బస్సులు వచ్చే అవకాశం లేకపోవడంతో బంగ్లా రోడ్డులోనే బారులు తీరాయి. దీం తో సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బంగ్లా రోడ్డు వరకు పోలింగ్ సామగ్రితోపాటు తమ లగేజీని తీసుకువచ్చేందుకు ఇబ్బంది పడ్డారు. మహిళా ఉద్యోగులు మరింత ఇబ్బంది పడ్డారు. ఆయా రూట్‌లకు సిబ్బం దిని వాహనాలలో పంపేందుకు సరైన ప్రణాళిక లేకపోవడంతో మరింత ఆలస్యం అయింది. దీంతో సిబ్బంది మరింత అసహనానికి గురయ్యారు.

144 సెక్షన్ అమలు

బల్లికురవ : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉందని ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని బల్లికురవ ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీలలో ఉన్న పో లింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారని ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియెగించుకోవాలన్నారు. ఎక్కడైనా ఎవరైనా పోలింగ్ బూత్‌ల వద్ద ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలింగ్ నిర్వహణకు ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేశామన్నా రు. ఫ్యాక్షన్ గ్రామం వేమవరంలో వెబ్ కెమెరాల ద్వా రా ఓటింగ్ జరుగుతుందన్నారు. అలానే రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పోలింగ్ కేద్రానికి రెండు వందల మీటర్ల దూరం ఎవరు ఉండరాదని ఆయన తెలిపారు. అలానే పలు రూట్లలో పోలీ సు సిబ్బందిని ఏర్పాటు చేశామని ఎక్కడైన ఎవైన గొడవలు జరిగితే వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

చీరాల : పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లు ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం పోలింగ్ అధికారులు, పోలీసులకు ఎన్నికల నియమావళి, విధి నిర్వహణపై అవగాహన శిక్షణలో భాగంగా అధికారులు దిశానిర్దేశం చేశారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. పోలీస్ శాఖ పరంగా డీఎస్పీ బేతపూడి ప్రసాద్ పోలింగ్ రోజు పోలీస్ అధికారులు, సిబ్బంది తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ జరిగేందుకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. పీవోలు, ఏపీవోలకు తమ, తమ ఎన్నికల సామగ్రిని అందజేశారు. ఎన్నికల ఏ ర్పాట్లకు సంబంధించి ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి మా ట్లాడుతూ మొత్తం పోలింగ్ ప్రక్రియలో భాగంగా పోలింగ్ బూత్‌లకు వెళ్లేందుకు 22 రూట్లు నిర్దేశించామన్నారు. పీవోలు, ఏపీవోలతోపాటు ఓపీవోలు మొత్తం 1239 మంది పోలింగ్ ప్రక్రియలో విధులు నిర్వహిస్తారన్నారు. పోలింగ్ అధికారులకు తగిన శిక్షణ ఇచ్చి ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని అందజేశామన్నారు. పోలింగ్ అధికారులు, మెటీరియల్ తరలింపుకు 20 ఆర్టీసీ బస్సులు, 43 ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం రాత్రికి పోలింగ్ అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లకు చేరుకుంటారన్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 218 బూత్‌లు ఉన్నాయన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలకు, పురుషులకు వేర్వేరుగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్‌లు ఏర్పాటు చేపించామన్నారు. అలానే ఎండల తీవ్రత నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు ఇబ్బంది లేకుండా షామియాలనాలు, మంచినీటి వసతి కల్పించామన్నారు. ప్రతి ఒక్క ఓటరు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ సామగ్రితో ఉన్న సిబ్బంది
ఈవీఎంలతో వాహనాల వద్దకు వెళ్తున్న సిబ్బంది



పర్చూరులో పోలింగ్ విధులకు హాజరైన సిబ్బంది

295 కేంద్రాల ఏర్పాటు

పర్చూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పగడ్బందీగా చేశారు. దీనికి సంబంధించి ఆదివారం బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సిబ్బందికి అవరసమైన ఈవీఎం, వీవీ ప్యాడ్స్ తదితర సామగ్రిని అందజేశారు. ఆయా సెక్టార్ పరిధిలోని ఎన్నికల కేంద్రాలకు బూత్‌లవారీగా పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో వాహనాల్లో సిబ్బందిని తరలించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పంచాయతీ, రెవెన్యూ సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు 295 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆర్వో గంధం రవీందర్ తెలిపారు. దీనికి సంబంధించి 3500 మంది సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. పోలీసు సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణలో సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. మైక్రో అబ్జర్వర్, వెబ్‌కేమ్‌తో పాటు, నేరుగా సీఈవో కంట్రోల్ రూంకు సమాచారం అందేలా వెబ్‌కేమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 53 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,29,333 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషలు 1,11,865, మహిళలు 1,17,462, ఇతరులు 6గురు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉందన్నారు.

నేడు పోలింగ్

మార్టూరు : సోమవారం జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు మార్టూరు మండలంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి, ఏజెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రికి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులను తరలించారు. మండలంలో 72 పోలింగ్ బూత్‌లున్నాయి. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు చెందిన 57121 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం, తాగునీరు. ఎండల దృష్టా షామియానులను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా ఓటర్లుకు ముఖ్యంగా మహిళలతో సహా ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాట్లు చేశారు. కేంద్రాలను ఎంపీడీవో నితిన్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్దకు పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేసినట్లు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతమైన వాతావరణంలో ఓటర్లు తమ ఓటు వేసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలో మేజర్ పంచాయతీ మార్టూరులో అధికంగా 19 పోలింగ్ కేంద్రాలు వలపర్ల గ్రామంలో 11 పోలింగ్ బూత్‌లున్నాయి.

ఇంకొల్లు : మండలంలోని 13 పంచాయతీలలో 20 గ్రామాలలో 54 పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఆదివారం పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో శ్రీదేవి పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది ఆయా కేంద్రాలకు ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. ఇంకొల్లు పంచాయతీ పరిధిలో 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హనుమోజిపాలెంలో ఒకటి, గొల్లపాలెంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మల్లికార్జునరావు కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సిబ్బందితో పకడ్బందీ చర్యలు చేపట్టారు.







కొత్తపేటలో కేంద్రాల వద్ద సూచికలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది.. మార్టూరు కాలేజీకి సామగ్రితో వస్తున్న సిబ్బంది.. ఎన్నికల నిబంధనలను వివరిస్తున్న డీఎస్పీ ప్రసాద్



తటస్థులే కీలకం..!

వారు ఎటు మొగ్గితే అటే గెలుపు

చీరాల, మే 12 : చీరాల. పోరాటాల పురుటిగడ్డ. చైతన్యం ఈ ప్రాంత ప్రజల సొంతం. విలక్షణ తీర్పు వారి నైజం. చీరాల నియోజకవర్గ ఆవిర్భావం నుంచి జరిగిన ఎన్నికల ఫలితాలు అందుకు దర్పణం పడుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి చీరాల నియోజకవర్గంలో త్రిముఖ పోటీ బలంగా కనిపిస్తోంది. వినిపిస్తోంది. అయితే ఈ ఎన్నికల్లో తటస్థ ఓటర్లు అభ్యర్థుల జయాపజయాలపై గణనీయమైన ప్రభావం చూపనున్నారు. వారు ఎటు మొగ్గితే అటే గెలుపు ఉంటుందని రాజకీయ మేధావులు అంచనా వేస్తున్నారు. 2014 ఎన్నికలలో ఆమంచి కృష్ణమోహన్ నవోదయం (స్వతంత్ర అభ్యర్థిగా) పార్టీ తరఫున పోటీలో నిలిచారు. టీడీపీ అభ్యర్థిగా పోతుల సునీత, వైసీపీ అభ్యర్థిగా యడం బాలాజీ బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో ఆమంచికి 57,544 ఓట్లు రాగా, పోతుల సునీతకు 47,209 ఓట్లు, యడం బాలాజీకి 40,995 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన ఆమంచి తరువాత టీడీపీలో చేరారు. 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వైసీపీలో చేరి ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ఆ క్రమంలో టీడీపీ వ్యూహాత్మకంగా కరణం బలరామకృష్ణమూర్తిని టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిపింది. ఆ ఎన్నికలలో బలరాంకు 83,163 ఓట్లు రాగా, ఆమంచికి 65,251 ఓట్లు వచ్చాయి. తరువాత నెలకొన్న రాజకీయ పరిణామాల క్రమంలో ప్రస్తుత ఎన్నికలలో టీడీపీ కూటమి అభ్యర్థిగా ఎంఎం కొండయ్య, వైసీపీ అభ్యర్థిగా కరణం బలరాం తనయుడు కరణం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆమంచి పోటీలో ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు ఆ తరువాత నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో గెలిచిన పార్టీలకు దూరమయ్యారు. ఆ క్రమంలో వారివారి గెలుపులో పాలుపంచుకున్న వేలమంది తటస్థులుగా మారారు. సంప్రదాయ టీడీపీ ఓటర్లలో అత్యధికులు కొండయ్యతోనే ప్రయాణం చేస్తున్నారు. ఇక తటస్థులుగా మారినవారు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. స్థానికంగా త్రిముఖ పోటీలో ఏ అభ్యర్థికి ఓటు వేస్తే తమకు భవిష్యత్‌లో న్యాయం జరుగుతుందనే కోణంలో వారు ఆలోచిస్తున్నారు. మొత్తం మీద తటస్థ ఓటర్లు ఎటు మొగ్గితే అటు అంతిమంగా విజయం దక్కుతుందని, టీడీపీ కూటమివైపు వారు ఆలోచిస్తున్నట్లు కన్పిస్తోందని రాజకీయ విశ్లేషకులతో పాటు, ఆయా పార్టీల శ్రేణులు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అద్దంకి నియోజకవర్గంలో 2,44,057 మంది ఓటర్లు



అద్దంకి, మే 12 : అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 2,44,057 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,19,570 మంది పురుషులు కాగా, 1,24,475 మంది మహిళలు, 12 మంది ఇతరులు ఉన్నారు. 298 పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే సంతమాగులూరు మండలంలో మొత్తం 51,401 మంది ఓటర్లు కాగా, వారి లో25,460 మంది పురుషులు, 25,938 మంది మహిళలు, ముగ్గురు ఇతరులున్నారు. బల్లికురవ మండలంలో మొత్తం ఓటర్లు 43,943 మంది కాగా, 21,871 మంది పురుషులు, 22,071 మంది మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారు. అద్దంకి రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు 39,731మంది కాగా, 19,610 మంది పురుషులు, 20,119 మంది మహిళలు, ఇతరులు ఇద్దరు ఉన్నారు. అద్దంకి పట్టణంలో మొత్తం ఓటర్లు 31,572 మంది కాగా, 15,121 మంది పురుషులు, 16,445 మంది మహిళలు, 6 మంది ఇతరులు ఉన్నారు. జె.పంగులూరు మం డలంలో మొత్తం ఓటర్లు 39,501 మంది ఓటర్లు కాగా, 19,207 మంది పురుషులు, 20,294 మంది మహిళలు ఉన్నారు. కొరిశపాడు మండలంలో మొత్తం ఓటర్లు 37,909 మంది ఓటర్లు కాగా, 18,301 మంది పురుషులు, 19,608 మంది మహిళలు ఉన్నారు.

మార్టూరులో 15389 ఓటర్లు, వలపర్ల గ్రామంలో 8230 ఓటర్లు, ద్రోణాదుల గ్రామంలో 5488 ఓటర్లు ఉన్నారు. దాంతో ఈ మూడు గ్రామాలపైనే టీడీపీ కూటమితోపాటు వైసీపీ వారు ప్రత్యేక దృష్టి సారించారు. ఇక మిగిలిన గ్రామాలలోనాగరాజుపల్లి, బొబ్బేపల్లి, జొన్నతాళి, రాజుపాలెం, డేగరమూడి, చిమ్మిరిబండ, కోలలపూడి, కోనంకి ,బొల్లాపల్లి, తదితర గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరడంతో మార్టూరు మండలంలో కూటమికి మంచి మెజారిటీ వస్తుందన్న ధీమాలో ఉన్నారు.

యద్దనపూడి మండలంలో 14 గ్రామ పంచాయతీలలో 21525 మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామాలలో 28 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారు. మండలంలోని పూనూరు గ్రామంలో అధికంగా 5 బూత్‌లుండగా వాటిలో 4265 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తర్వాత యద్దనపూడి గ్రామంలో 4 బూత్‌లుండగా వాటిలో 2868 మంది ఓటర్లు ఉన్నారు. ఇ క మండలంలోని శ్యామల వారిపాలెంలో 90వ బూత్‌లో అత్యల్పంగా 287 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లును పూర్తి చేసినట్లు తెలిపారు.

ఓటు వేయండి..ఉచిత వైద్య పరీక్షలు పొందండి

శ్రీ కామాక్షి కేర్ హాస్పటల్ ఎండీ దేవరాజ్

చీరాల, మే 12 : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. సోమవారం ఓటు వేసిన వారు తమ ఆసుపత్రిలో ఉచితంగా షుగర్, ఈసీజీ పరీక్షలు చేయించుకోవచ్చని శ్రీ కామాక్షికేర్ హాస్పటల్ ఎండీ తాడివలస దేవరాజ్ ఆదివారం తెలిపారు. అయితే ఓటు వేసినట్లు వేలిపై సిరా గుర్తు చూపి ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఓటు హక్కును వినియోగించుకునే వారి సంఖ్య పెంచాలనే సదుద్దేశంతనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు దేవరాజ్ తెలిపారు.

స్వల్పంగా గాయపడ్డ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మే 12 : ఎన్నికల ప్రచార ముగింపుసభలో వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో టీడీపీ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. కాలికి స్వల్పగాయం కావడంతో పాటు రెండు కాళ్లకు వాపులు రావడంతో నొప్పితో బాధపడుతున్నారు. వెంటనే వైద్యులు మాగుంటకు వైద్యం అందించారు. మాగుంట ఆయన అభిమానులు పరామర్శించారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరినవారితో ఎమ్మెల్యే ఏలూరి

వైసీపీ పాలనలో ఐదేళ్లూ అవరోధాలే..!

» ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలి
» భవిష్యత్ తరాలకు ఇదే కీలకఘట్టం » ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మే 12 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అవరోధాలే తప్ప ఎలాంటి అభివృద్ధి లేదని, ప్రజలకు ఈ ఎన్నికలే సరైన అవకాశమని.. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని టీడీపీ ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఐదేళ్ల పాటు అనేక సమస్యలతో సతమతమై ఇబ్బందులు పడ్డ ప్రజలంతా భావితరాల భవిష్యత్ కోసం ఓటు అనే వజ్రాయుధంతో సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. యువ ఓటర్లంతా బంగారు భవిష్యత్ కోసం ముందుకు సాగాలన్నారు. అపార రాజకీయ అనుభం, విజన్ ఉన్న చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి మంచిరోజులు రానున్నాయని, దీనికి ప్రజలు ఓటు హక్కుతో అవకాశం కల్పించాలన్నారు. ప్రజా కూటమి అనూహ్య రీతిలో భారీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పర్చూరు ప్రజల ఆకాంక్షను తీర్చేలా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు.

ఓటు వేయకపోతే పట్టాలు రద్దు

ఓటర్లను భయపెడుతున్న వైసీపీ నాయకులు

గంగవరం (ఇంకొల్లు), మే 12 : ఓటు వేయకపోతే పట్టాలు రద్దు చేస్తామని వైసీపీ నాయకులు ఓటర్లను భయపెడుతున్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో వైసీపీ నాయకులు ఓటర్లను బెదిరిస్తున్నారని టీడీపీ గ్రామ నాయకుడు కెల్లంపల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఎస్సీ కాలనీలో 30 ఎస్టీ కుటుంబాల వారున్నారు. వీరంతా టీడీపీకి అనుకూలంగా ఓటు వేస్తారనే అనుమానంతో స్థానిక వైసీపీ నాయకులు ఆదివారం రాత్రి పై విధంగా బెదిరింపులకు పాల్పడ్డారని వెంకటేశ్వర్లు ఆరోపించారు. వైసీపీకి ఓటు వేయకపోతే మీ పట్టాలు రద్దు చేయిస్తామని ఓటర్లను బెదిరించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు కాలనీకి వెళ్లడంతో వైసీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఆదిశంకరాచార్య ఆరాధనోత్సవాలు

దొనకొండ, మే 12: దొనకొండ మండల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శంకర జయంతి సందర్భంగా శ్రీఆదిశంకరాచార్య ఆరాధనోత్సవాలు ఆదివారం స్థానిక అడ్డురోడ్డులోని విజయాంజనేయస్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదిశంకరాచార్యులు అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ఏకీకృతం చేసిన భారతీయ తత్వవేత్త అని అన్నారు. హిందూధర్మాన్ని సుస్థిరం చేయటానికి, వ్యాప్తి చేయడానికి దేశంలో నాలుగుమూలలా నాలుగు మఠాలను స్థాపించారన్నారు. ఈసందర్భంగా మహన్యాసకపూర్వ ఏకాదశి రుద్రాభిషేకాలు, బ్రాహ్మణులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల బ్రాహ్మణ సంఘం సెక్రటరీ హరికృష్ణ, కోశాధికారి ఎం.సాయిరామ అనీల్, గోపాలుని సుబ్రమణ్యం, డాక్టర్ ఎంఎం మల్లికార్జునశర్మ, అనుమల మణిబాబు, పి.మణికంఠశర్మ పాల్గొన్నారు.

పోలింగ్ ముందురోజు వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన జడ్పీటీసీ సభ్యురాలు, మరికొందరు

బల్లికురవ, మే 12 : పోలింగ్ సమయం కొన్ని గంటలలో ఉండగా వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. బల్లికురవ జడ్పీటీసీ సభ్యులు చిం తల అంజలి శ్రీనివాసరావు వైసీపీకి గుడ్‌బై చెప్పి ఆదివారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని కొమ్మినేనివారిపాలెంకు చెందిన జడ్పీటీసీ సభ్యులు చింతల అంజలి శ్రీనివాసరావు, గ్రామ వైసీపీ అధ్యక్షుడు పూరేటి వెంకటనారాయణ వారి అనుచరులతో కలిసి వైసీపీకి రాజీనామా చేసి ఎమ్మె ల్యే గొట్టిపాటిని కొమ్మినేనివారిపాలెంకు ఆహ్వానించి ఆయన సమక్షంలో వారు టీడీపీకి మద్దతు తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల ప్ర చారం ముగిసి ఓటింగ్‌కు గంటల వ్యవధి ఉన్న సమయంలో జడ్పీటీసీ, గ్రామ వైసీపీ నేతలు మూకుమ్మడిగా వైసీపీని వీడడంతో బిగ్ షాక్ తగిలింది. ఇప్పటికే బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో వైసీపీ నేతలు గత పదిరోజుల వ్యవధిలో పెద్ద ఎత్తున వైసీపీని వీడి సైకిల్ ఎక్కారు. కొత్త పాత నేతల కలయికలతో టీడీపీ కేడర్ జోష్‌లో ఉంది. ఎన్నికలలో మండలంలో అత్యధిక మెజారిటీ సాధిస్తామని వారు అంటున్నారు.



గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీ సభ్యురాలు అంజలి శ్రీనివాసరావు



టీడీపీలో చేరిన కోటపాడుకు చెందిన వైసీపీ కుటుంబాలు

టీడీపీలో చేరిన కోటపాడు వైసీపీ శ్రేణులు

పంగులూరు : మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఆదివారం వీరందరికీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముప్పవరం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నిర్లక్ష్యం.. ప్రయాణం నరకం..!

» అభివృద్ధికి నోచుకోని ఇంకొల్లు - పర్చూరు రోడ్డు
» రూ.22కోట్ల నిధులు మంజూరు
» చేసిన కొంత పనులకు కాంట్రాక్టర్‌కు చెల్లించని బిల్లులు
» నాలుగేళ్లుగా అవస్థలు » డైవర్షన్ రోడ్డుపైనా గుంతలు

ఇంకొల్లు, మే 12 : ఇంకొల్లు టు పర్చూరు ఆర్అండ్‌బీ రహదారి రెండులైన్లగా విస్తరణ చేసేందుకు ప్రభుత్వం రూ.22కోట్లు మంజూరు చేసింది. ఏడాదిగా ప్రారంభించిన పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేశారు. గత ఏడాది మార్చిలో రోడ్డ విస్తరణ పనులు ప్రారంభించి ఇంకొల్లులో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు పర్చూరు వరకు సాగర్ కాల్వలపై కల్వర్టర్లను నిర్మించారు. దగ్గుబాడు వద్ద వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేశారు. వంకాయలపాడు వద్ద చెరువుకట్టకు సైడు వాల్స్ కొంతమేరకు పూర్తి చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద చింతమానులను తొలగించారు. యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి కదా ఇంకేముంది ఈ ప్రాంతవాసులు ఇంకొల్లు నుంచి పర్చూరు రహదారిలో ప్రయాణ కష్టాలు తప్పి సుఖంగా సాగుతోందని ఊహించారు. కానీ అది కలగానే మిగిలింది. ఇంకొల్లు నుంచి పర్చూరు వరకు రెండు లైన్‌లుగా అభివృద్ధి చేసేందుకు రూ.22కోట్ల నిధులు మంజూరు కాగా, కాంట్రాక్టరు చేసిన పనులకు సుమారు రూ.5కోట్ల మేర బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదే. రోడ్డు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గత నాలుగైదు నెలలుగా కాంట్రాక్టరు పనులు చేసేందుకు నిరాకరించి ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తేనే పనులు చేపడతామన్నట్లు సమాచారం. నాలుగేళ్లలుగా ప్రయాణికులు ఈ రహదారిలో ప్రయాణించాలంటే నరకయాతనలు పడుతున్నారు. ముఖ్యంగా ఇంకొల్లు నుంచి వంకాయలపాడు మార్కెట్ యార్డ్ వరకు రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ 13 కిలో మీటర్ల మేర 20నిమిషాలు సాగాల్సిన ప్రయాణం 45 నిమిషాలపైనే పడుతోందని ప్రయాణికులు చెప్తున్నారు. పూసపాడు అడ్డరోడ్డు వద్ద ఉన్న నక్కవాగుపై వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇక్కడ డైవర్షన్‌రోడ్డు వేసారు. అది కూడా గుంతలమయమై వాహనాల రాకపోకలకు ఇబ్బంది జరుగుతోంది. వైసీపీ నిర్లక్ష్యం వల్లే ఇబ్బందిపడుతున్నామని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



వంకాయలపాడు చెరువు వద్ద మధ్యలో నిలిచిన పనులు





డైవర్షన్ రోడ్డుపై గుంతలు.. అడ్డరోడ్డు వద్ద శిథిలమైన వంతెన